## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని తమ్మినాయుడుపేటలో బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు బోర సాయిరాం రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ తదితరులు హాజరై పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తారని పేర్కొన్నారు. మండల పార్టీ కమిటీ సభ్యులు, నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

### ప్రథమ చికిత్సపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రాం మేనేజర్ రమణ

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలోనూ ముందుండాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో మంగళవారం జూనియర్ రెడ్‌క్రాస్ విభాగం ప్రారంభించారు. ప్రథమ చికిత్స, సీపీఆర్‌లపై అవగాహన కల్పించారు. జూనియర్ రెడ్‌క్రాస్ కార్యక్రమాలు, సీపీఆర్, రికవరీ, యాంటీ షాక్, విద్యుత్ షాక్, పాముకాటు, గుండెపోటు తదితర సమహార్ట్ ఎటాక్ తదితర అత్యవసర సమయాల్లో తీసుకోవాల్సిన చర్యలను ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రభావతి, జూనియర్ రెడ్‌క్రాస్ కన్వీనర్ పి.రామకృష్ణ, రమాదేవి, రెడ్‌క్రాస్ సిబ్బంది ఉమాశంకర్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

### కిడ్నీ బాధిత కుటుంబానికి సాయం



సాయం అందిస్తున్న దాతలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మంగువారి తోటలో నివాసముంటున్న ఎస్.నాగరాజు, శ్యామల కుటుంబానికి ట్రెజరీ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ మంగళవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించింది. నాగరాజు టీబీ, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇంటికే పరిమితమయ్యారు. ఆయన భార్య రెండు కిడ్నీలు పాడై ఓ ప్రైవేటు ఆసుపత్రిలో డయాలసిస్ పొందుతోంది. మందులు కొనుక్కోనే స్తోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న ట్రెజరీ హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు మాదారపు డేవిడ్ నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించేందుకు ముందుకొచ్చారు. నాగరాజు కుమార్తె చదువుకు సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కె.వరప్రసాద్, కె.లక్ష్మమ్మ, కె.హేమలత, ఉర్లం శివతేజ, బమ్మిడి వేణు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ బీసీ సంక్షేమ సంఘ ఉపాధ్యక్షుడిగా వెంకటరావు



నియామక పత్రం అందుకుంటున్న వెంకటరావు

శ్రీకాకుళం రూరల్: పెదపాడు గ్రామానికి చెందిన కాయితీ వెంకటరమణ జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు లాక వెంగళరావు నియామక పత్రాన్ని అందజేసినట్లు వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈయన భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీగానూ సేవలందించారు.

### అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం




థియేటర్ సిబ్బందికి కరపత్రాలు అందిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రణస్థలం: అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రణస్థలం అగ్నిమాపకాధికారి పైల అశోక్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని రామాంజనేయ థియేటర్, వ్యాపార కూడలిలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ అంతస్తుల్లో జరిగే అగ్నిప్రమాదాలు, గ్యాస్ సిలిండర్ పేలుడు వంటి ఘటనల్లో ఎలా స్పందించాలో వివరించారు.

# ఊరు.. బెల్టు జోరు!





గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం తరలింపు

- పల్లెల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులు
- బాటిల్‌పై అదనంగా రూ.50 బాదుడు
- పట్టించుకోని అధికారులు

జి.సిగడాం: పచ్చటి పల్లెల్లో బెల్టుషాపుల విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం లభిస్తుండటంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్మునంతా మందుకే ఖర్చు పెడుతుండటంతో కుటుంబం ఎలా గడిచేదెంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చుక్క మంచినీరు దొరకని గ్రామాలు ఉన్నాయి గానీ మందు దొరకని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. కొన్నిచోట్ల మందు కల్తీచేయడమే కాకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

జి.సిగడాం మండలంలోని మెట్టవలస, సర్వేశ్వరపురం, జి.సిగడాం గ్రామాల్లో ప్రభుత్వ వైన్స్ దుకాణాలు ఉన్నాయి. 31 గ్రామ పంచాయతీల్లోని 43 రెవెన్యూ గ్రామాల్లో అనధికారికంగా మద్యం బెల్టు దుకాణాలు వెలిశాయి. ప్రతి పల్లెలో సుమారు 4 నుంచి 7 వరకు బెల్టుషాపులు నడుస్తున్నాయి. ఇందులో బాటిల్‌పై అదనంగా రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.



ద్విచక్రం వాహనాలపై బహిరంగంగా మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్న దృశ్యం

**అంతా బహిరంగమే..**

గ్రామాల్లో ద్విచక్ర వాహనాల ద్వారా బహిరంగంగా మద్యం సీసాలను బెల్టుషాపులకు తీసుకెళ్తున్నారు. మీరు అమ్మేసి మాకు డబ్బులు చెల్లించండి అంటూ కొందరు నిర్వాహకులు ఇంటింటికి వెళ్లి మందు సరఫరా చేస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో ఓ వ్యక్తి మూడు మద్యం సీసాలు కంటే అధికంగా కనిపిస్తే కేసులు నమోదు చేసేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వైన్‌షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం, అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో ప్రతి గ్రామంలో మద్యం ఏరులై పారుతోంది. ఈ ఏడాది జనవరి 5న స్థానిక పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి 480 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ నెల 11వ తేదీన 128 మద్యం బాటిళ్లతో ఓ వ్యక్తి పట్టుబడ్డారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం మండలంలో ఇంతవరకు అక్రమంగా తరలిస్తున్న మద్యంపై ఎటువంటి నిఘా వేయడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**వేలాది బాటిళ్ల తరలింపు..**

జి.సిగడాం మండల కేంద్రంలో రెండు, సర్వేశ్వరపురం, మెట్టవలస గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా ప్రతి రోజు వేలాది మద్యం సీసాలు ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా బెల్టు షాపులకు తరలిపోతున్నాయి. సీసాకు అదనంగా రూ.50 వసూలు చేస్తున్నారు. ఎవరైనా దీనిపై సమాచారం అందిస్తే అధికారులు, పోలీసులు తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టి వెళ్లిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**బెల్టుషాపులు అరికట్టాలి..**

గ్రామాల్లో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతివీధిలోనూ బెల్టుషాపులు తెరవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్యానికి బానిసైన యువతకు మందు నిత్యం అందుబాటులో ఉండటంతో అనారోగ్యంతో పాటు కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే బెల్టుషాపులు నిర్మించాలి.

– బుడారి లక్ష్మణరావు, సర్పంచ్, సంతవురిటి, జి.సిగడాం

## ఇవేం పనులో..!

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని డీసీసీబీ కాలనీలో సానావీధికి వెళ్లే దారిలో కాలువపై పలకలు తొలగించి వారాలు గడుస్తున్నా నిర్మాణాలు మాత్రం చేపట్టడం లేదు. ఇక్కడి ప్రధాన కూడలి వద్ద కొంతమేర రోడ్డు వేసినా అక్కడ వ్యర్థాలు మాత్రం నెలలు గడుస్తున్నా తీయడం లేదు.



పనులు పూర్తయిన చోట కుప్పలుగా వ్యర్థాలు



డీసీసీబీ కాలనీలో తవ్వేసి వదిలేసిన దృశ్యం

దీంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఓ దగ్గర వృథా.. మరో చోట వ్యథ అనే చందంలా మారింది. నిర్మాణాలు చేపట్టిన చోట క్యూరింగ్ (వాటరింగ్) సరిగా చేయకపోవడంతో నిర్మించిన రోడ్ల మరమ్మతులు వేసిన మూడు రోజులకే సిమెంట్ పెచ్చులూడిపోతున్నాయి.

## నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు

జి.సిగడాం: నవధాన్యాల సాగుతో నేల తల్లి సారవంతమవుతుందని ఆర్‌టీఓ హేమసుందరరావు అన్నారు. మంగళవారం జి.సిగడాం రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల ఆధ్వర్యంలో 9 జాతులు, 30 రకాల విత్తనాలతో నవధాన్యాల కిట్లు తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు, ద్రావణాలు, కషాయాలతో సాగు చేస్తే అధిక దిగుబడులతో పాటు నేలకు రక్షణ కలుగుతుందన్నారు. తక్కువ పెట్టిబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. అనంతరం బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, వావిలాకు కషాయం, తూటికాడ కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, మారేడు పత్రం కషాయాలను తయారీ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కె.కృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి బూరాడ శ్రీనివాసరావు, సంతోషి కుమారి, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాలతో తయారు చేసిన విత్తనాలు

## పారదర్శకంగా ఓటరు జాబితా

శ్రీకాకుళం రూరల్: ఎన్నికల నిమయ నిబంధనలు ప్రకారం రాజకీయ పార్టీల సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు రెవెన్యూ డివిజినల్ అధికారి సాయి ప్రత్యూష తెలిపారు. మంగళవారం శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మృతులు, వివాహం జరిగి వేరే గ్రామాలకు వెళ్లిన యువతుల ఓటర్ల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని అన్ని రాజకీయ పార్టీల నేతలు కోరారు. ఎపిక్ కార్డులో ఒక వ్యక్తికి రెండు ఓట్లు ఉన్న మొత్తం జాబితాను ఆర్డీఓ అన్ని రాజకీయ పార్టీ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారదర్శక ఓటరు జాబితాకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ ఎస్.గణపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, గార తహశీల్దార్ పద్మావతి, వివిధ రాజకీయ పార్టీల నేతలు అంబటి శ్రీనివాసరావు, మాదారపు వెంకటేష్, ఆర్.పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ప్రత్యూష

## చెరువు గట్లు తవ్వేస్తున్నారు!



కొర్ని పెద్ద చెరువు గట్టు వద్ద మట్టి అక్రమ తవ్వకాలు

గార: ఓవైపు చెరువులు పటిష్టంగా ఉండేందుకు ఉపాధి హామీ పనులు చేపట్టి గట్లు పటిష్టం చేస్తుంటే.. మరోవైపు అధికార పార్టీ నాయకులు ఆ గట్లు తవ్వేసి జేబులు నింపుకుంటున్నారు. ఇదే తరహాలో కొర్ని గ్రామంలో పెద్ద చెరువు గట్లను మట్టి మాఫియా ఇష్టానుసారంగా తరలించుకుపోతోంది.

రాత్రి, పగలు అనే తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారు. టీడీపీ నాయకుల అండదండలుండటం, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంతో తవ్వకాలు ఆగడం లేదని స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. కొర్ని సచివాలయానికి కూతవేటు దూరంలోనే ఈ తవ్వకాలు జరుగుతున్నా వీఆర్‌వో గాని, ఉపాధి హామీ సిబ్బంది గానీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆటోలకు క్యూఆర్ కోడ్‌లు



ఎచ్చెర్ల స్టేషన్ ముందు సర్వీస్ రోడ్డుపై నిలిచి ఉన్న ఆటోలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల పరిధిలో జాతీయ రహదారిపై, ఇతర ప్రాంతాల్లో ప్రజారవాణాకు ఉపయోగిస్తున్న ఆటోలకు ఎచ్చెర్ల పోలీసులు క్యూఆర్ కోడ్‌లు అతికిస్తున్నారు. దీనిని స్కాన్ చేస్తే ఆటో డ్రైవర్, ఇతర సమాచారం లభిస్తుంది. నేర నియంత్రణలో భాగంగా క్యూఆర్ కోడ్‌తో పాటు శక్తి యాప్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### వైభవంగా వార్షికోత్సవ పూజలు



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని గిరిజా ముక్కంటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకులు పెంట రామారావు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, అర్చన, హోమాలు జరిగాయి.

### రికార్డుల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: బీఎడ్ మూడో సెమిస్టర్ రికార్డుల పరిశీలన చేపట్టనున్నట్లు పీజీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మంగళవారం తెలిపారు. 13 కళాశాల రికార్డులను వర్సిటీ విద్యావిభాగం అధ్యాపకులు పరిశీలిస్తారని, ఈ ప్రక్రియ పక్కాగా ఉంటుందని చెప్పారు.

### నేడు ఫిర్యాదుల స్వీకరణ

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని కల్యాణ మండపంలో బుధవారం స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలు నుంచి ప్రజా సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ, మధ్యాహ్నం టీడీపీ పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు మీసాల సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

### ప్రభుత్వ బడుల్లో ఉత్తమ విద్య



మరువాడలో సర్వే చేస్తున్న ఎంఈవో లావణ్య

రణస్థలం: నిపుణులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమైన బోధన అందిస్తున్నట్లు ఎంఈవో-2 బోనెల లావణ్య తెలిపారు. మరువాడ గ్రామంలో మంగళవారం ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలంటూ ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం పెడతారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సంతోష్ కుమార్, సర్పంచ్ జక్కంపూడి అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సకాలంలో పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి అన్నారు. మంగళవారం గంగన్నదొరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. -జి.సిగడాం

### విజయగణపతికి అభిషేకాలు



పాలకొండ రోడ్డులోని విజయ గణపతి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వేసవి నేపథ్యంలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేశారు.

- శ్రీకాకుళం కల్చరల్

### వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభం



పాతశ్రీకాకుళంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీకూర్మం ఆలయ అర్చకులు నల్ల కూర్మన్‌దాసు, బూరాట కృష్ణామాచార్యుల పర్యవేక్షణలో స్వామివారి వాహనమైన గరుడ జెండాను ఆవిష్కరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్

## చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహారం అందజేసే అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ అన్నారు. పొన్నాడ ప్రాజెక్టు పరిధిలో ఏజీఎన్‌పేటలో మంగళవారం పౌష్టికాహార పక్షోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. తొలి 1000 రోజులు శిశువు పెంపకం కీలకమని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో పాపినాయుడు, సూపర్‌వైజర్లు అరుణకుమారి, శరణ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

## బీసీ కార్పొరేషన్ యూనిట్లపై స్పష్టత కరువు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక ముందుకు సాగడం లేదు. మండలానికి 117 యూనిట్లు మంజూరు కాగా, 877 దరఖాస్తులు వచ్చాయి. 677 మంది ధ్రువీకరణ పత్రాలు పరిశీలనకు హాజరయ్యారు. 117 మంది లబ్ధిదారుల జాబితా ఎంపిక చేసి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తక్కువ యూనిట్లు కావటంతో టీడీపీ నాయకులు జాబితాలు సిద్ధం చేయలేకపోతున్నారు. మరోవైపు బీజేపీ, జనసేన నాయకులు సైతం తమ వర్గానికి చెందిన వారిని ఎంపిక చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. వాస్తవంగా బ్యాంకు విల్లింగ్ తరువాత వ్యాపార యూనిట్ ఏర్పాటు చేస్తే రుణం ఇవ్వాలి. అయితే యూనిట్‌తో సంబంధం లేకుండా రుణాలు పొందాలని కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారు. బ్యాంకులు మాత్రం గతంలో రుణాలు తీసుకున్న వారికి, యూనిట్లు ఏర్పాటు చేయనివారికి రుణాలు అందజేయలేమని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, అర్హత లేకపోయినా కూటమి నాయకుల సిఫార్సులకు తలొగ్గితే చట్టపరంగా పోరాటం చేస్తామని కొందరు హెచ్చరిస్తున్నారు. తక్కువ యూనిట్లు ఉండటం, 28 పంచాయతీలు నుంచి ఎక్కువ మంది కూటమి నాయకులు రుణాలు ఆశించటం, మంజూరైన యూనిట్లు మేరకు ఎంపిక జాబితా సిద్ధం చేయలేకపోవటం సమస్యగా మారాయి.

### సేవాభావంతో మెలగాలి

శ్రీకాకుళం రూరల్: నర్సింగ్ విద్య ఉత్తమమైనదని, రోగుల పట్ల సేవాభావంతో పనిచేయాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రజనీ అన్నారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో మంగళవారం 9వ బ్యాచ్ నర్సింగ్, 7వ బ్యాచ్ జీఎన్‌ఎం విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్ సెమినరీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రమశిక్షణ, సమయస్ఫూర్తితో సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో జెమ్స్ ఆస్పత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత, అకడమిక్ డైరెక్టర్ కె.సుధీర్, సూపరింటెండెంట్ డాక్టర్ అంబేడ్కర్, డాక్టర్ రామారావు, డాక్టర్ హేమంత్, డాక్టర్ రాజకుమారి, బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నర్సింగ్ విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

## కుమ్మరిపేటలో కరెంట్ కష్టాలు

గార: మండల కేంద్రంలోని కుమ్మరిపేట గ్రామస్తులను విద్యుత్ కష్టాలు వెంటాడుతున్నాయి. గ్రామ సమీపంలో పొలం గట్ల మధ్య అప్పటి విద్యుత్ సిబ్బంది అనాలోచిత నిర్ణయాలతో మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. చిన్నపాటి గాలి వీచినా, వర్షం వచ్చినా కుమ్మరిపేటలో కొన్ని వీధులకు కరెంటు ఉండటం లేదు. రాత్రివేళ ఫ్యూజు పోయే సమయంలో ఎనర్జీ అసిస్టెంట్ వెళ్లి మరమ్మతులు చేసేందుకు కూడా దారి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పొలాల గట్లపై మినీ ట్రాన్స్‌ఫార్మర్

